క్లుప్తంగా

అల్జీమర్స్‌పై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ప్రదీప్‌చంద్ర

దెందులూరు: అల్జీమర్స్ జ్ఞాపక శక్తి ఆలోచన ప్రవర్తన నెమ్మదిగా ప్రభావితం చేసే ఒక రకమైన న్యూరోలాజికల్ డిజార్డర్ అని, దీనిపై విస్తృతంగా అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని డాక్టర్ కె.ప్రదీప్ చంద్ర అన్నారు. ఆదివారం ఏలూరు రూరల్ మండలం చాటపర్రు పీహెచ్‌సీలో జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ అల్జీమర్స్ దినోత్సవం నేపథ్యంలో అవగాహన సమావేశం నిర్వహించారు. డాక్టర్ ప్రదీప్ చంద్ర మాట్లాడుతూ అల్జీమర్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంస్థ కోఆర్డినేటర్ డి శ్రీనివాసరెడ్డి, ఎంపీహెచ్‌ఓ రామాంజనేయులు పాల్గొన్నారు.

ఏలూరు ఎంపీడీఓగా దయాసాగర్



దయాసాగర్

దెందులూరు: ఏలూరు రూరల్ మండలం ఎంపీడీఓగా భీమనేని దయాసాగర్ ఏలూరు రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఎంపీడీఓగా చేసిన శ్రీలత పశ్చిమగోదావరి జిల్లా జాతీయ ఉపాధి హామీ పథకం పీడీగా పదోన్నతి బదిలీ రావడంతో ఆమె స్థానంలో దయాసాగర్ నియమితులయ్యారు.

అలరించిన సంగీత మహోత్సవాలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): అంబికా సంస్థల వ్యవస్థాపకుడు ఆలపాటి రామచంద్రరావు సాంస్కృతిక, కళా రంగాలకు అందించిన కృషి ఘనమైనదని అతిథులు గుర్తు చేసుకున్నారు. అంబికా సంస్థలు, హిందూ యువజన సంఘం సంయుక్త ఆధ్వర్యంలో అంబికా సంస్థల వ్యవస్థాపకుడు ఆలపాటి రామచంద్రరావు శత జయంతి ఉత్సవాలు (1926–2025) సందర్భంగా స్థానిక వైఎంహెచ్‌ఏ హాలులో నిర్వహిస్తున్న ఆలపాటి రామచంద్రరావు సాహిత్య సంగీత మహోత్సవాలలో భాగంగా రెండో రోజు ఆదివారం నిర్వహించిన సంగీత సమ్మేళనం ప్రేక్షకులను విశేషంగా అలరించింది. చెన్నైకి చెందిన నాసికాగ్ర నాగభూషణ సాయి హేమంత్ కృష్ణ బృందం నిర్వహించిన నాసికా వేణునాథం కార్యక్రమం ఆకట్టుకుంది. ఉదయం నిర్వహించిన రాత సమీక్షలో గెలుపొందిన విజేతలకు ముఖ్య అతిథులు చేతుల మీదుగా బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో అంబికా కృష్ణ, అంబికా ప్రసాద్, అంబికా రాజా, యర్రా సోమలింగేశ్వర రావు, కేవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

నేటి నుంచి దేవీ నవరాత్రి మహోత్సవాలు

- ముస్తాబైన అమ్మవార్ల ఆలయాలు
- ప్రత్యేక పూజలు, విశేష అలంకరణలకు ఏర్పాట్లు



పత్తేబాద శ్రీ కనక దుర్గ అమ్మవారి ఆలయం వద్ద విద్యుత్ దీపాలతో అలంకరించిన స్వాగత ద్వారం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): దసరా అంటేనే తెలుగు ప్రజలు చేసుకునే పెద్ద పండుగల్లో ఒకటి. సంక్రాంతి తరువాత విద్యార్థులకు ఎక్కువ రోజులు సెలవులు దొరికే పండుగ కూడా ఇదే. ఈ దసరా పండుగకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలు, ఇతర రాష్ట్రాల్లో స్థిరపడిన తెలుగు ప్రజలు తమ స్వగ్రామాలకు వస్తుంటారు. అలాగే పండుగ సందర్భంగా పిల్లలకు దొరికే సెలవులను బట్టి తీర్థ యాత్రలకూ ప్రణాళికలు వేసుకుంటూ ఉంటారు. నగరంలో శ్రీ దేవీ నవరాత్రి మహోత్సవాలు ఈ నెల 22 నుంచి వైభవంగా ప్రారంభం కానున్నాయి. ఈ ఉత్సవాలు వచ్చే అక్టోబర్ 2 వరకూ కొనసాగనున్నాయి. ప్రతీ ఏడాదిలానే ఈ ఏడాది సైతం అమ్మవారి ఉత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించడానికి నగరంలోని వివిధ అమ్మవార్ల ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏడాది ఉత్సవాలు 10 రోజుల పాటు నిర్వహించాల్సి ఉందని, 11వ రోజున ఆలయాల్లో శమీ పూజలతో ఉత్సవాలకు ముగింపు పలుకవలసి ఉంటుందని పండితులు చెబుతున్నారు. అందుకు తగ్గట్టుగానే ఆలయాల్లో ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఉత్సవాల అనంతరం పలు ఆలయాల్లో మహాన్న సమారాధనలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

అమ్మవార్ల ఆలయాలు ముస్తాబు

దసరా ఉత్సవాలను పురస్కరించుకుని ఇప్పటికే నగరంలోని పలు అమ్మవార్ల ఆలయాలు సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంటున్నాయి. ఆలయ కమిటీల ప్రతినిధులు, దేవదాయ శాఖ అధికారులు ఆలయాలకు నూతనంగా రంగులు వేయించి ఆలయ ప్రాంగణాల్లో చలువ పందిళ్లు వేయిస్తున్నారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకునే సమయంలో వారికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి పర్వదినం సందర్భంగా ఈ నెల 22న ప్రారంభమయ్యే నవరాత్రి ఉత్సవాల్లో భక్తులు ప్రతి నిత్యం అమ్మవార్ల ఆలయాలను సందర్శించే అవకాశం ఉండడంతో అందుకు తగ్గట్టు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రశాంత వాతావరణంలో భక్తులు అమ్మవార్లను దర్శించుకునేందుకు, దర్శనానంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టారు.

ఉత్సవాల నిర్వహణ ఇలా

అక్టోబర్ 2 వరకూ అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించే ఈ ఉత్సవాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరుపనున్నారు. ఉత్సవాల ప్రారంభం సందర్భంగా విఘ్నేశ్వర పూజ, అఖండ దీపారాధన, కలశ స్థాపన చేయనున్నారు. అమ్మవార్లకు ప్రతీ నిత్యం క్షీరాభిషేకాలు, బాలభోగ వినియోగాలు, శ్రీచక్ర అర్చనలు, హోమాలు, కుంకుమార్చనలు, శ్రీ లలితా సహస్రనామ పారాయణలు నిర్వహించనున్నారు. అలాగే నవరాత్రుల సందర్భంగా అమ్మవార్లకు రోజుకు ఒక ప్రత్యేక అలంకరణ చేయనున్నారు. అలాగే భక్తుల గోత్రనామాలతో విశేష పూజలు, నీరాజన మంత్రపుష్పాలు, తీర్థ ప్రసాద వినియోగ సేవలు నిర్వహించనున్నారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆయా ఆలయాల్లో శమీ పూజలు నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా అమ్మవార్లకు శ్రీ బాలా త్రిపుర సుందరి, శ్రీ గాయత్రి దేవి, శ్రీ కాత్యాయని దేవి, శ్రీ మహాలక్ష్మీదేవి, శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవి, శ్రీ మహా సరస్వతీ దేవి, శ్రీ రాజరాజేశ్వరీ దేవి, శ్రీ మహాదుర్గాదేవి, శ్రీ మహాకాళికా దేవి తదితర అలంకరణలు చేయనున్నారు. స్థానిక పవర్‌పేటలోని శ్రీ కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి దేవస్థానం, పవర్‌పేట వాసుదేవాలయం ప్రాంగణంలోని శ్రీ రాజ్యలక్ష్మీదేవి దేవస్థానం, రామచంద్రరావు పేట శ్రీమత్ మార్కండేయ వేదపాఠశాల, పత్తేబాద శ్రీ కనకదుర్గ ఆలయం, 12 పంపుల సెంటర్ శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయం, అగ్రహారంలోని శ్రీ కన్యకాపరమేశ్వర ఆలయం, సత్రంపాడు శ్రీ సౌభాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయం, దక్షిణపు వీధిలోని శ్రీ బాలాత్రిపుర సుందరి దేవి ఆలయం, బావిశెట్టి వారి పేట శ్రీ కనకదుర్గాంబ అమ్మవారి ఆలయం, దొండపాడు శ్రీ నందత్తనాథ క్షేత్రంలోని శ్రీ రాజరాజేశ్వరి దేవి ఆలయం తదితర ఆలయాల్లో దేవీ నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

11 రోజులు ఉత్సవాలు



ఈ ఏడాది దసరా నవరాత్రి ఉత్సవాలు 11 రోజుల పాటు నిర్వహించాల్సి ఉంది. ఉత్సవాలు ప్రారంభమైన అనంతరం 4వ రోజు చవితి తిది 25న గురువారం ప్రారంభమై 26న కూడా ఉండడంతో ఉత్సవాలమరో రోజు అదనంగా చేయాల్సి ఉంటుంది. విజయవాడ కనకదుర్గ అమ్మవారి దేవస్థానంలో చవితి తొలి రోజు అమ్మవారికి శ్రీ కాత్యాయని అమ్మవారి అలంకరణ చేయాలని నిర్ణయించడంతో అదే ఆలయ సంప్రదాయాలను కొనసాగించే రాష్ట్రంలోని ఇతర దేవాలయాల్లో సైతం 25న అమ్మవార్లకు శ్రీ కాత్యాయని దేవి అలంకరణ చేయడానికి ఏర్పాటు చేస్తున్నారు.

– వారణాశి శ్రీ రాఘవేంద్ర శర్మ, ప్రధానార్చకులు శ్రీ అంబికా దేవి ఆలయం

171 మందికి కంటి పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న నిపుణులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక రామకోటి ప్రాంగణంలో నగరానికి చెందిన సామాజికవేత్త మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో ఆదివారం పరమహంస యోగానంద నేత్ర వైద్యశాల వేమగిరి బృందంతో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి 171 మంది హాజరయ్యారు. వారందరికీ వైద్య బృందం నేత్ర పరీక్షలు నిర్వహించి 21 మందికి శస్త్రచికిత్సలు అవసరమవుతాయని నిర్ణయించారు. శస్త్ర చికిత్సలు అవసరమవుతాయని గుర్తించిన వారందరినీ వేమగిరి హాస్పిటల్‌కు తీసుకువెళ్లారు. వారికి శస్త్ర చికిత్సలు నిర్వహించి తిరిగి ఏలూరుకు చేర్చుతారని రామారావు తెలిపారు. కాగా ఆ శిబిరంలో కళ్లజోళ్లు అవసరమని గుర్తించిన 27 మందికి సబ్సిడీ ధరలకు కళ్లజోళ్లు పంపిణీ చేశారు. శిబిరంలో పాల్గొన్న పేదలకు బొలిశెట్టి సురేష్ కుమార్, పిల్లి పండరీనాథ్, తవ్వ అజయ్ కుమార్ తదితరులు సేవలు అందించారు.

వ్యాయామ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపు

దెందులూరు: విద్యార్థులకు విద్య, క్రీడలతో పాటు సమాజ సేవ అవసరమని గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.నతానియేలు అన్నారు. ఆదివారం వ్యాయామ కళాశాలలో ఎన్ఎస్ఎస్ క్యాంప్ డైరెక్టర్ రత్నబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. డీపీఈడీ, బీపీఈడీ వ్యాయామ అధ్యాపక విద్యార్థులు కళాశాలలో తరగతి గదుల బయట గోడలకు సున్నం, రంగులు వేశారు.

ఈ–శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కార్మిక శాఖ ఏసీఎల్ నాగేశ్వరరావు

ఏలూరు (టూటౌన్): కార్మికులందరూ తక్షణమే ఈ–శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని కార్మిక శాఖ సహాయ సంచాలకులు నాగేశ్వరరావు కోరారు. స్థానిక ఇఫ్టూ జిల్లా కార్యాలయంలో పెయింటింగ్ కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో కన్వీనర్ లొట్ల సత్యనారాయణ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ (ఏసీఎల్) నాగేశ్వరరావు మాట్లాడుతూ పెయింటింగ్ కార్మికులందరూ లేబర్ ఆఫీసులో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఇఫ్టూ ఏలూరు నగర ప్రధాన కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు ప్రముఖ న్యాయవాది కెవి.రత్నం మాట్లాడుతూ సంక్షేమ బోర్డులో వందల కోట్ల రూపాయలు ఉన్నాయని అవి కార్మికులకు సంబంధించిన కుటుంబాల అవసరాలకే వాడాలని కోరారు. ఈ జనరల్ బాడీ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఏలూరు ఏరియా పెయింటింగ్ కార్మిక సంఘాన్ని ఇఫ్టూకీ అనుబంధం చేయాలని ఏలూరు పెయింటింగ్ కార్మికులు తీర్మానం చేశారు. ఏపీ ప్రగతిశీల భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం నగర అధ్యక్ష కార్యదర్శులు నవుడు నెహ్రూ బాబు, కాకర్ల శ్రీను, ఎలక్ట్రికల్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు లింగమల్లి శ్రీనివాసరావు, అరుణోదయ సాంస్కృతి సమాఖ్య ఏలూరు నగర ప్రధాన కార్యదర్శి పల్లి గంగరాజు, జి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గుంతలు పూడ్చిన స్థానికులు



క్రొవ్విడి అంబేద్కర్ కూడలిలో పూడ్చిన గుంతలు

సాక్షి స్పందన

నిడమర్రు: క్రొవ్విడి ఆర్అండ్‌బీ రహదారి ప్రమాదకరంగా ఉందంటూ ఈ నెల 8న ప్రచురితమైన నరకానికి రహదారి అనే వార్తకు స్థానిక పెద్దలు, ఆక్వా రైతులు స్పందించారు. మాజీ వైస్ ఎంపీపీ నౌడు అచ్యుత రామారావు, గ్రామ పెద్ద వాకమూడి ఇంద్ర ఆధ్వర్యంలో ఆక్వా రైతుల సహకారంతో క్రొవ్విడి గ్రామంలో అధ్వానంగా ఉన్న గుంతలను బ్లాక్ స్టోన్, ఎర్రకంకర రాళ్లతో జేసీబీ సహకారంతో గుంతల పూడిక పనులు చేయిస్తున్నారు.

దళితులకు ప్రత్యేక శ్మశాన వాటికలు కేటాయించాలి

దెందులూరు: ఏలూరు జిల్లాలో దళితులకు ప్రత్యేక శ్మశానాలు ఏర్పాటు చేయాలని వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధికార ప్రతినిధి కత్తుల రవి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సంస్కృతి సంప్రదాయాలను గౌరవించాలన్నారు. మరణానంతరం ఏ వ్యక్తికైనా జరగాల్సిన అంతిమ కార్యక్రమం కనీస మర్యాదలతో జరగటానికి శ్మశాన సౌకర్యం అవసరమన్నారు. పెదపాడు మండలంలో తోట గూడెం, దాసరిగూడెం గ్రామాల్లో దళితులకు శ్మశాన స్థలం లేదన్నారు. రాజుపేట గ్రామంలో శ్మశానం ఉన్నప్పటికీ దారి సౌకర్యం లేకపోవడం గమనార్హమన్నారు. ఏలూరు జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న కోమటి లంకలో ఇటీవల ఒక వ్యక్తి చనిపోతే ఉధృతంగా వస్తున్న ప్రవాహంలో రేకు పడవలో మృతదేహాన్ని తీసుకెళ్లిన సంగతి హృదయ విదారకమన్నారు. జిల్లా వ్యాప్తంగా శ్మశానాలు లేని చోట స్థలం కేటాయించి స్థలమున్న చోట సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కత్తుల రవి కోరారు.

4న తిరుపతిలో దేవాంగ సత్రం ప్రారంభం



దేవాంగ సంక్షేమ సంఘ సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): తిరుపతి మహాపుణ్య క్షేత్రం, ఓల్డ్ తిరుచానూరు రోడ్, శ్రీ అంకాల పరమేశ్వరి దేవస్థానం పక్కన ఒక ఎకరం స్థలంలో రూ. 45 కోట్లతో నిర్మించిన శ్రీనివాస ఉమా రామలింగేశ్వర నిత్యాన్నదాన దేవాంగ సత్రాన్ని అక్టోబర్ 4, శనివారం ఉదయం 9.42 గంటలకు ప్రారంభిస్తామని దేవాంగ సంక్షేమ సంఘం నాయకులు తెలిపారు. ఆదివారం స్థానిక తూర్పువీధిలోని దేవాంగ సత్రంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి దేవాంగులంతా పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. తిరుపతిలో మూడు బ్లాకులుగా ఒక్కొక్క బ్లాక్ 6 అంతస్తులుగా దేవాంగ సత్రం నిర్మించారన్నారు. కార్యక్రమంలో సత్రం అధ్యక్షుడు బొమ్మన దుర్గా ప్రసాద్, ప్రధాన కార్యదర్శి నక్కిన చిన్న వెంకటరాయుడు, ట్రస్టీ మెంబర్, ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు బందారు ఆనంద ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఊటుకూరు సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శి మాడిశెట్టి శివ శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

అమ్మవార్ల ఆలయాల్లో ప్రత్యేక పూజలు



కనకదుర్గాంబ అమ్మవారి ఆలయంలో మహాలయ అమావాస్య పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలోని వివిధ అమ్మవార్ల ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాలయ అమావాస్య సందర్భంగా స్థానిక బావిశెట్టివారిపేటలో ఉన్న శ్రీ కనకదుర్గ అమ్మవారి దేవస్థానంలో అమ్మ వారికి ఉదయం 108 లీటర్ల ఆవు పాలు, పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించి విశేష అలంకరణ చేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొంది తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సీహెచ్ చిన నాగేశ్వర రావు కార్యక్రమాలు పర్యవేక్షించారు.

పత్తేబాదలో

స్థానిక పత్తేబాదలోని ఉన్న శ్రీ కనకదుర్గ అమ్మవారి దేవస్థానంలో సోమవారం నుంచి ప్రారంభమయ్యే 55వ దసరా మహోత్సవాలు సందర్భంగా ఆదివారం ఉదయం అమ్మవారికి 108 కలశాలతో పంచామృత, వివిధ పండ్లరసాలతో అభిషేకం చేశారు. అనంతరం శ్రీచక్రార్చన చేశారు. ఆలయ అర్చకుడు ప్రయాగ వెంకట రామమూర్తి విశేష పూజలు నిర్వహించగా ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ పృథ్వీ సత్యనారాయణ మూర్తి, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు. ఈఓ సతీష్ కుమార్ నల్లూరి కార్యక్రమాలు పర్యవేక్షించారు.

కాలానుగుణంగా ఫొటో, వీడియోగ్రాఫర్స్ మారాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): మారుతున్న కాలానికి, టెక్నాలజీకి అనుగుణంగా ఫొటో, వీడియో గ్రాఫర్స్ మారవలసిన అవసరం ఎంతైనా ఉందని ఏలూరు నగరపాలక సంస్థ కో–ఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు సూచించారు. ఆదివారం స్థానిక పవర్ పేట ఐఎంఏ హాల్లో జరిగిన ది.ఏలూరు అవుట్ డో ఫొటోగ్రాఫర్స్ అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొబైల్ ఫోన్స్ వచ్చాక ఫొటో, వీడియో గ్రాఫర్స్ వృత్తి దెబ్బతిందన్నారు. అనంతరం నిర్వహించిన ఎన్నికల్లో అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడిగా పెదబాబు ఐదో సారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా వై. రంగారావు, సెక్రటరీగా వెంకట్, కోశాధికారిగా బి.అప్పారావు ఎన్నికయ్యారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	20	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	28	చిక్కుడు కాయలు	64
వంకాయలు (కాంతులు)	36	బీరకాయలు	00
వంకాయలు (తెలుపు)	00	చామదుంపలు	36
బెండకాయలు	24	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	36	కంద	00
కాకర కాయలు	34	బీట్‌రూట్	36
బీరకాయలు	30	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	36	ఫ్రెంచ్‌బీన్స్	70
క్యాబేజీ	26	అల్లం	70-96
క్యారెట్	44	కొత్తిమీర (కట్ట)	25
దొండకాయలు	34	పాలకూర	10
బంగాళదుంపలు	34	తోటకూర	10
ఉల్లిపాయలు	15	చుక్కకూర	10
గోరుచిక్కుడు	40	గోంగూర	07-10
దోసకాయలు	26	పుదీనా	05
అనబకాయ (1)	20	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	48

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	35
ఏలూరు – జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	35
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	36
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	20
ఏలూరు – అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	27
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.15	4822	28
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	22
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	22
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	25
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	29
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	19
ఏలూరు – తిరుపతి	16.00	4830	34

శక్తి టీమ్ సేవలు అభినందనీయం



మహిళా స్టేషన్ సీఐ సుబ్బారావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న దృశ్యం

ఏలూరు టౌన్: మానసిక ఒత్తిడి, ఇబ్బందులతో ఒక మహిళ ఆత్మహత్యాయత్నం చేసింది. అయితే ఏలూరు శక్తిటీమ్ కౌన్సిలింగ్, మానసిక స్థైర్యంతో నేడు ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం సాధించింది. ఆమె ఆదివారం ఏలూరు మహిళా స్టేషన్ సీఐ ఎం.సుబ్బారావుకు పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపింది. ఏలూరు నగరానికి చెందిన ఒక మహిళ కొంత కాలం క్రితం ఆత్మహత్యాయత్నానికి పాల్పడాలనే ఉద్దేశంతో ఇంటినుంచి బయటకు వచ్చేసింది. తీవ్ర మానసిక ఒత్తిడితో బాధపడుతూ కుంగిపోయిన ఆమె చావే శరణ్యంగా భావించింది. 2025 మే 23న ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించడంతో డయల్ 112కు కుటుంబ సభ్యులు ఫోన్ చేయటంతో ఏలూరు శక్తిటీమ్ సభ్యురాలు సుజాత వెళ్లిఆమెను ఆత్మహత్యాయత్నం నుంచి రక్షించి వెనక్కి తీసుకువచ్చారు. ఏలూరు మహిళా స్టేషన్ సీఐ సుబ్బారావు ఆ మహిళకు కౌన్సిలింగ్ ఇచ్చారు. దీంతో ఇటీవల ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం సాధించింది. శక్తిటీమ్ తనకు ఇచ్చిన మద్దతు, మానసిక స్థైర్యంతోనే జీవితంలో విజయాన్ని సొంతం చేసుకున్నానని ఆ మహిళ తెలిపింది.

అధ్వాన రోడ్డుతో తప్పని తిప్పలు



అధ్వానంగా ఉన్న రహదారి

భీమడోలు: రాష్ట్రీయ రహదారి భీమడోలు జంక్షన్ నుంచి సంతమార్కెట్ వరకు గల రోడ్డు అధ్వానంగా మారింది. భీమడోలు స్టేట్ బ్యాంకు సమీపంలోని ఓ ఆసుపత్రి వద్ద గల రోడ్డుపై భారీ గుంతల నేపథ్యంలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలువురు గాయాలపాలవుతున్నారని పలుమార్లు సాక్షిలో పలు కథనాలు ప్రచురించారు. సంబంధిత ఆర్అండ్‌బీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. అయితే భీమడోలులో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఆ గుంతల్లో వర్షం నీరు భారీగా చేరింది. అదే సమయంలో భీమడోలు రైల్వే గేటు నుంచి జంక్షన్‌కు పండ్ల లోడుతో వస్తున్న ఆటో డ్రైవర్ అంచనా వేయకపోవడంతో ఆటో గుంతలో పడి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. దీంతో ఆటోలో పండ్లన్నీ రోడ్డుపై పడి దెబ్బతిన్నాయి. ఆటో పాక్షికంగా దెబ్బతినడంతో నష్టం వాటిల్లింది. ఈ రోడ్లుపై ఏర్పడిన గుంతలతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. ఇది ద్వారకాతిరుమల పుణ్యక్షేత్రానికి వెళ్లే ప్రధాన రహదారి అవడంతో భక్తులు, ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు.

గిరిపుత్రులు మెచ్చిన ఆహారం

- గిరిజనుల ఆహారంలో భాగం పుట్టగొడుగులు
- నాటు పుట్టగొడుగులకు పెరిగిన డిమాండ్



అటవీప్రాంతంలో లభించిన నాటు పుట్టగొడుగులు

బుట్టాయగూడెం: వర్షాకాలం ప్రారంభం కాగానే అటవీ ప్రాంతంలో పుట్ట గొడుగులు పెరుగుతూ ఉంటాయి. వీటిని గిరిజనులు ఎక్కువగా ఇష్టపడతారు. అటవీ ప్రాంతంలో పెరిగే పుట్టగొడుగులు గిరిపుత్రుల ఆహారంలో భాగమవుతున్నాయి. అయితే ఈ ఏడాది వర్షాలు అంతంతమాత్రంగానే కురిశాయి. అయితే గత వారం రోజుల క్రితం నుంచి కురుస్తున్న వర్షాలతో పశ్చిమ మన్యంలోని అటవీ ప్రాంతంలో పుట్టల్లో నాటు పుట్టగొడుగులు అత్యధికంగా లభిస్తున్నాయి. వర్షాలతో పడడంతో పుట్టలపై పుట్టగొడుగులు కనిపిస్తున్నాయి. దీంతో అటవీ ప్రాంతానికి దగ్గరగా ఉన్న గిరిజనులు నాటు పుట్టగొడుగులను తీసుకొచ్చి విక్రయిస్తున్నారు.

కట్ట రూ.100 చొప్పున విక్రయం

అటవీ ప్రాంతంలో లభించే పుట్టగొడుగులను 25 నుంచి 30 వరకు ఒక కట్టగా కట్టి సుమారు రూ.100కు గిరిజనులు విక్రయిస్తున్నారు. అడవిలో లభించే నాటు పుట్టగొడుగులకు అధిక డిమాండ్ ఉంది. పుట్టగొడుగులు అడవి నుంచి తీసుకువచ్చి వెంటనే అమ్ముడుపోతున్నాయి. అయితే పుట్టగొడుగుల సేకరణ అంత సులభం కాదు. తెల్లవారు జామున అటవీ ప్రాంతానికి వెళ్లి పుట్టలపై ఉన్న పుట్టగొడుగులను సేకరించాలి. ఒక్కోసారి ఆ పుట్టల్లో పాములు కూడా ఉంటాయి. అలాగే చీమలు కూడా కుడతాయి. పుట్టగొడుగులకు వెళ్లిన గిరిజనులు విషపురుగుల బారిన పడిన సంఘటనలూ ఉన్నాయి. అయితే ప్రతి ఏటా వర్షాకాల సీజన్‌లో ఈ ప్రాంతానికి వచ్చి పుట్టగొడుగులను తీసుకెళ్లిన వారు ఉన్నారు. ఈ ఏడాది కూడా వర్షాలకు పుట్టగొడుగులు లభించడంతో వాటి కోసం అనేక మంది ఏజెన్సీకి క్యూ కడుతున్నారు. కొంతమంది వీటిని గిరిజన ప్రాంతంలో రూ.100కు కొనుగోలు చేసి, బయటి ప్రాంతాల్లో రూ.300 నుంచి రూ.400 వరకూ విక్రయిస్తున్నారు. ప్రకృతి సిద్ధంగా లభించే ఈ పుట్టగొడుగులు ఎంతో రుచిగా ఉండటమే కాకుండా ఆరోగ్యవంతమని గిరిజనులు చెబుతున్నారు.

చిన్నప్పటి నుంచి తింటున్నాను



నేను చిన్నప్పటి నుంచి మా అడవిలో లభించే పుట్ట గొడుగులను తింటున్నాను. ఏది తినాలి, ఏది తినకూడదు అనే విషయాన్ని మా పెద్దల ద్వారా తెలుసుకుని మరీ తింటున్నాను. వర్షకాలం వచ్చిందంటే మా గ్రామంలో అందరూ అడవికి వెళ్లి సేకరిస్తారు. అధికంగా లభిస్తే బయట వ్యక్తులకు విక్రయిస్తాం.

–కోర్స గంగరాజు, కామవరం, బుట్టాయగూడెం మండలం

అటవీ ప్రాంతంలో అధికంగా లభిస్తాయి



మా గ్రామ సమీపంలో ఉన్న అటవీ ప్రాంతంలో నాటు పుట్టగొడుగులు అధికంగా లభిస్తాయి. ప్రతి ఏటా వర్షాలు కురిసే సమయంలో ఈ పుట్టగొడుగులు మొలుస్తాయి. వాటిని సేకరించి తింటాం. ఇవి ఆరోగ్యానికి ఎంతో మంచిది.

కోర్స రాంబాబు, కామవరం, బుట్టాయగూడెం మండలం